ఫుట్‌పాత్‌లు మాయం

- జీవీఎంసీ 24, 14వ వార్డుల్లో పాదచారులకు అవస్థలు
- పట్టించుకోని జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ అధికారులు



నక్కవానిపాలెంలో ఫుట్‌పాత్ మీద సాగిస్తున్న వ్యాపారాలు



ఆక్సిజన్ టవర్స్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన బడ్డీలు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు

బడ్డీలు ఏర్పాటు చేసి అద్దెలకిస్తూ...

నక్కవానిపాలెం శివాలయం ప్రాంతంలో కొబ్బరిబొండాల వ్యాపారం, ఇతర చిరువ్యాపారాలు సాగుతున్నాయి. ఇక్కడి ఇందిరాగాంధీ పార్కు ఎదురుగా ఫుట్‌పాత్‌ల మీద కిరాణా, సైకిల్, ఐస్‌క్రీమ్, మోటార్ మెకానిక్ దుకాణాలు ఏర్పాటు చేశారు. పలు తోపుడు బండ్లు కూడా ఏర్పాటు చేశారు. గురుద్వారా వసంతబాల పాఠశాల రోడ్డులో పలు దుకాణాలున్నాయి. ఒక వ్యక్తి ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి బడ్డీలు ఏర్పాటు చేసి అద్దెకిచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఎన్ఆర్ఐ హాస్పిటల్ రోడ్డులో ఇష్టారాజ్యంగా తోపుడుబళ్లతోపాటు బడ్డీలు ఏర్పాటు చేశారు.

టీడీపీ నాయకుల అండతోనే ఆక్రమణలు

నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ఆక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేసి రెండు లక్షలకు విక్రయించారనే ఆరోపణలున్నాయి. బాలయ్యశాస్త్రి లే అవుట్, నరసింహనగర్ సర్వీస్ రోడ్డులో బడ్డీలు ఏర్పాటు చేసి మరీ అద్దెలకు ఇస్తున్నారు. ఈ రోడ్డులో ఏకంగా సిమెంట్, కాంక్రీట్ వినియోగించి శాశ్వత బడ్డీలు ఏర్పాటు చేసేశారు. కొంత మంది టీడీపీ నాయకుల అండతోనే అక్రమంగా బడ్డీలు ఏర్పటు చేస్తున్నట్లు తెలుస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు వస్తే మావాడే అని సదరు టీడీపీ నాయకులు చెప్పడంతో చేసేది లేక సిబ్బంది వెనుతిరుగుతున్నారు. ఇక్కడ జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గతంలో కొన్ని బడ్డీలను తొలగించారు. అయితే ఆ సమయంలో తూతూమంత్రంగా చర్యలు చేపట్టడంతో కొద్ది రోజులకే యథావిధిగా ఆక్రమించేసి **బడ్డీలు ఏర్పాటు చేయడం గమనార్హం**

సీతమ్మధార : జీవీఎంసీ 24, 14వ **వార్డుల్లో వ్యాపారుల** పుణ్యమా అని ఫుట్‌పాత్‌లు **మాయమైపోతున్నాయని** పాదచారులు ఆందోళన **వ్యక్తం చేస్తున్నారు**. ఒకవైపు జీవీఎంసీ స్థలాల్లో **ఆక్రమణలు**, మరోవైపు ఫుట్‌పాత్‌ల మీద బడ్డీల **ఏర్పాటు కారణంగా** రాకపోకలకు అవస్థలు పడుతున్నా**మని వాపోతున్నారు**. రోడ్లపైనే నడుస్తూ ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, పీ అండ్ టీ కాలనీ, సీతమ్మధార రైతుబజారు ప్రాంతం, టీపీటీ కాలనీ, గురుద్వారా నుంచి సీతమ్మధార తహ**సీల్దార్ కార్యాలయం రోడ్డు, ఎన్ఆర్ఐ హాస్పిటల్ రోడ్డు, నార్త్ ఎక్స్‌టెన్షన్, బాలయ్యశాస్త్రి లే అవుట్, తదితర ప్రాంతాల్లో స్మార్ట్‌సిటీ కింద జీవీఎంసీ లక్షలాది రూపాయలు వెచ్చించి ఫుట్‌పాత్‌లను సర్వాంగ సుం**దరంగా తీర్చిదిద్దింది. కానీ అవి నిర్మించిన కొద్ది రోజులకే ఆక్రమణకు గురయ్యాయి.

- టీపీటీ కాలనీలోని ఎస్సీ హాస్టల్ సమీపాన గల జీవీఎంసీ స్థలంలో అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ పాన్‌షాపులు, ట్రావెల్స్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో షెడ్లు కూడా ఏర్పాటు చేసి నివాసం ఉండడం గమనార్హం. **సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయా**నికి వచ్చే రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఇష్టారాజ్యంగా ఆక్రమించేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పాదచారులు ఆందోళన చెందుతున్నారు. పాన్‌షాపులు, పార్లర్లు, వాటర్‌క్యాన్, మెకానిక్ షెడ్లు, తోపుడు బండ్లు, టైర్ దుకాణాలు, టీ దుకా**ణాలు ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడంతో ఫుట్‌పాత్‌లు మచ్చుకైనా కానరావడం లేదు.**

నిత్యం ట్రాఫిక్ కష్టాలు

ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేయడంతో నరసింహనగర్ సర్వీస్ రోడ్డుతోపాటు ఇతర మార్గాల్లోనూ నిత్యం ట్రాఫిక్ రద్దీ కనిపిస్తోంది. పాఠశాలకు విద్యార్థులు, సిబ్బంది, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించే సమయంలో **ట్రాఫిక్** ఇక్కట్లు తప్పడం లేదని విచారం **వ్యక్తం చేస్తున్నారు**. పలు ప్రాంతాల్లో **రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల** కారణంగా ట్రాఫిక్ **జామ్ అవుతోంది. కొందరు** చిరువ్యాపారులు ఏకం**గా ఫుట్‌పాత్‌లు తవ్వేసి ఇను**ప రాడ్లు సైతం ఏర్పాటు **చేయడం గమనార్హం. జీవీఎంసీ** ఆస్తులకు నష్టం కలిగిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ అధికారులు, ద్వారకా పోలీసులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎన్ఆర్ఐ హాస్పిటల్ రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు



గురుద్వారా వసంతబాల పాఠశాల రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు



నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కు ఎదురుగా ఏర్పాటు చేసిన దుకాణాలు

క్లుప్తంగా

ఉత్తమ బ్రాంచ్ చైర్మన్‌గా జీవీ రెడ్డికి అవార్డు



ఉత్తమ బ్రాంచ్ చైర్మన్ అవార్డు అందుకుంటున్న జీవీ రెడ్డి

మద్దిపాలెం : ఆల్ ఇండియా ఎంఈఎస్ బీఏఐ ఉత్తమ బ్రాంచ్ చైర్మన్‌గా విశాఖపట్నానికి చెందిన జీవీ రెడ్డి అవార్డు అందుకున్నారు. ఫిబ్రవరి 21న న్యూఢిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ ఆడిటోరియం సుబ్రతో పార్క్‌లో నిర్వహించిన వార్షికోత్సవంలో అవార్డును ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బ్రాంచి డైరెక్టర్ జనరల్ వర్క్స్ మేనేజర్ జనరల్ రాజు సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు. విశాఖపట్నం బ్రాంచ్ చైర్మన్‌గా జీవీ రెడ్డి సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడంతో ఈ అవార్డు పొందారు. మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఎస్ బీఏఐ) 1974 నుంచి ఎంఈఎస్‌తో కలిసి పనిచేస్తుంది. ఈ సంస్థ దేశవ్యాప్తంగా అనేక శాఖలు కలిగి ఉంది,. విశాఖపట్నం బ్రాంచి నుంచి జీవీ రెడ్డి నేతృత్వంలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, విజయవంతంగా పూర్తి చేస్తుంది. ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ బాల సతీష్, వైజాగ్ బ్రాంచి సెక్రటరీ చిరంజీవి, అసోసియేషన్ సభ్యుల సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగానని గుజ్జు వెంకటరెడ్డి తెలిపారు.

పోలీసుల సమక్షంలో మట్టి తొలగింపు




డెబ్రిస్ తొలగింపును పర్యవేక్షిస్తున్న పోలీసులు, అధికారులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని సీతమ్మధార సమీప అల్లూరి సీతారామరాజు విగ్రహం పక్కన ఆంజనేయస్వామి షెడ్డు గోడలు విరగ్గొట్టిన వివాదాస్పద డెబ్రిస్‌ను పోలీసుల సమక్షంలో శనివారం తొలగించారు. ద్వారక సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర, హెచ్‌సీ, కానిస్టేబుళ్ల బందోబస్తు మధ్య జీవీఎంసీ 14వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ వెంకటనారాయణ కార్మికులతో మట్టిని వ్యానులో తరలించారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో కేర్ ఆస్పత్రి, హెచ్‌సీజీ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ వై.విజయ ఆదిత్య, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ వై.రఘు, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ఎం.రేవంత్ వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఆర్బీఎస్, బీపీ, ఈసీజీ, బీఎండీ, సీబీసీ, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. మురళీనగర్ పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో 60 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఢిల్లీకి చెందిన బీనా, పూజా అరోరా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలి జిల్లాకు చెందిన వివేక్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, వారి నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.


స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రిజర్వేషన్లు పెంచాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం : స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రైల్వే న్యూ కాలనీలో గల ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్ కేంపింగ్ సెంటర్‌లో శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఖ్య పెరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర రంగాల్లో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల శాతం మరింత పెంచితే ఎక్కువ మంది ఆసక్తి చూపుతారన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తమ కమిషన్ తీసుకెళ్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వరల్డ్ థింకింగ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్స్ సంస్థ కార్యదర్శి కేఆర్ జగన్నాథం, సంస్థ వైస్ ప్రెసిడెంట్ నరవ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్‌కుమార్, చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ప్రతినిధి కె.ఎల్లయ్య, జిల్లా కమిషనర్లు ఎస్‌వీ రమణ, ఆర్.మధుసూధనరావు, కె.పద్మ, జీవై నాయుడు, అసిస్టెంట్ సెక్రటరీ జి.సంధ్యారాణి పాల్గొన్నారు.

శ్రీరామ పట్టాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి



భక్తులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో శ్రీరామ పట్టాభిషేక ఉత్సవం ఆదివారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నడూ లేనంతగా భారీ ఎత్తున ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తవాస్మిదాస బృందం, శ్రీరామ సేవా సమితి సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నాయి. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ఎన్ రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పట్టాభిషేకం ఉత్సవంలో దంపతులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేశారు. సీతారాముల విగ్రహాలతో పూజ చేసేందుకు వీలుగా వేదిక అలంకరించారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు శోభాయాత్ర నిర్వహిస్తారు. 9 గంటలకు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై వేంజేపచేసి పట్టాభిషేకం నిర్వహిస్తారు. శ్రీరాముడికి అష్టోత్తర నామావళి పూజ, సీతమ్మవారికి కుంకుమ పూజ, ఆంజనేయ స్వామికి 108 తమలపాకుల పూజ నిర్వహిస్తారు.

ఉత్సాహంగా వరల్డ్ థింకింగ్ డే



ర్యాలీలో పాల్గొన్న బుల్లయ్య కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్

సీతంపేట : స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని (వరల్డ్ థింకింగ్ డే) ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటికి పరిష్కారాలను వివరించారు. ఆలోచనా దినోత్సవాన్ని నిర్వహించిన కళాశాల రోవర్స్, రేంజర్స్ విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, రోవర్ లీడర్స్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, ఫ్లైట్ లెఫ్టినెంట్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, రేంజర్ లీడర్స్ గంగాభవాని, స్వాతికృష్ణ యాదవ్, సూర్య ఎల్లమాంబేశ్వరి పాల్గొన్నారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ



శ్రీలలితాపీఠంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట : మాఘమాసం శనివారం సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీ లలితాపీఠంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పారాయణ చేశారు. ముందుగా స్వామికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, విశేష హారతులిచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా 26న ఉదయం అఘోర మృత్యుంజయ పాశుపత హోమం, రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం నివేదించారు. అనంతరం భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగం నివేదించారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీపీఎంఎస్ నూతన కార్యదర్శి మిశ్రాకు సత్కారం



మిశ్రాను సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

కంచరపాలెం: బీపీఎంఎస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కే మిశ్రా ఎన్నికైన సందర్భంగా శనివారం 104 ఏరియా బాపూజీనగర్‌లోని బీపీఎంఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఐఎన్‌సీఎంఎస్ జనరల్ సెక్రటరీ రాజేష్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మిశ్రాను ఘనంగా సత్కరించారు. కార్మికుల సమస్యలపై మిశ్రా పోరాటాలు ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పుట్టా విద్యాసాగర్, నాయుడు, సివిలియన్ మజ్దూర్ సంఘ్ గౌరవాధ్యక్షుడు దేవుడు నాయుడు, సత్యశ్రీనివాస్, చింతాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న బంగారి సురేష్ కుమార్

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్ కమ్యూనిటీ హాల్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారి సురేష్ కుమార్, జై భీమ్ ఎస్సీ, బీసీ, మైనారిటీ సేవా సంఘం కార్యదర్శి కోరిబిల్లి రాజేశ్వరరావు అన్నదానం ప్రారంభించారు. సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపాలి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆర్.వెంకటరావు, ఉపాధ్యక్షుడు బైరో మూర్తి, కార్యదర్శి బి.అప్పారావు, దేవుడు, గణేష్, కొండయ్య, నాగేశ్వరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువకుడు

సీతమ్మధార : గంజాయి సేవిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. రైల్వే కాలనీకి చెందిన సాయి (25) గంజాయి విక్రయించి, సేవిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు శనివారం సోదాలు చేశారు. ఆ సమయంలో సాయి గంజాయి సేవిస్తూ కనిపించడంతో అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్‌కు డిమాండ్



సమావేశంలో ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు

సీతంపేట : విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్ చేయాలని, గత పదేళ్లుగా పెన్షన్ అప్‌డేట్ కాక ఎంతో నష్టపోతున్నామని ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ వారణాసి కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రెండో ప్రాంతీయ సమావేశం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఐదేళ్లకు పెన్షన్ రివైజ్ చేయాల్సి ఉన్నా గత పదేళ్లుగా చేయలేదన్నారు. పదవీ విరమణ చేసినప్పుడు ఎంత బేసిక్ ఉందో అంతే ఉందని, దీనివల్ల విశ్రాంత ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. వెంటనే పెన్షన్ అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగుల ఇన్సూరెన్స్ ప్రీమియం చాలా ఎక్కువగా ఉండటం వల్ల, పెన్షన్ కంటే ప్రీమియం ఎక్కువగా ఉంటోందని, ప్రీమియంలో కొంత భాగం బ్యాంకు యాజమాన్యం భరించాలని కోరారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో అడ్వైజర్లు జి.ఎస్.వి.కృష్ణారావు, సత్యప్రసాద్, డీజీఎస్ వి.వాసుదేవ మూర్తి, ఏజీఎస్ టంకాల కామేశ్వరరావు, సీసీఎం మూల భాస్కర్, కోశాధికారి ఎం.జయరావు, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం మరువలేనిది



సీతమ్మధార అల్లూరి జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార : అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం నుంచి అల్లూరి సమాధి ఉన్న క్రిష్ణదేవి పేట వరకు చేపట్టిన ప్రజా జాతాను శనివారం ఘనంగా ప్రారంభించారు. ప్రజాజాతాకు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు ఆహ్వానం పలికారు. ముందుగా సీతమ్మధార సర్కిల్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశాన్ని నిరంకుశంగా 200 సంవత్సరాలకు పైగా పరిపాలించిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దోపిడీ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకలించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు పోరాడారన్నారు. అలాంటి వారిలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఒకరిని కొనియాడారు. ప్రొఫెసర్ కొలవెన్ను చాంద్ మాట్లాడుతూ ఎంతో ధైర్య సాహసాలతో, రాజీలేని పోరాట మార్గంలో, సామాన్య ప్రజల పక్షాన నిలబడిన అల్లూరి సీతారామరాజు తన ప్రాణాలు సైతం అర్పించారన్నారు. డాక్టర్ రామచంద్ర రాజు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున జీవిస్తున్న ఆదివాసీల దుర్భర జీవితాన్ని చూసి చలించిపోయాడని, వారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, పోరాట యోధులుగా తయారు చేశారని గుర్తుచేశారు. ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్య వ్యాపారంగా మారడం వల్ల విద్యార్థులు లక్షలాది రూపాయల ఫీజులు కట్టాల్సి వస్తోందన్నారు. మార్కులు, ర్యాంకుల కోసం విపరీతమైన ఒత్తిడి పెంచుతున్నారన్నారు. ఫలితంగా విద్యార్థులు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు సినిమాలు, మీడియాలో మితిమీరిన అసభ్యత, హింస, పోర్న్ వెబ్‌సైట్లు విద్యార్థుల ఆలోచనలను దారి తప్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ సత్యవతి, పౌర చైతన్య వేదిక కార్యదర్శి సీహెచ్ ప్రమీల, మహేష్, అభిలాష్, సంతోష్, శివ ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.